విత్తనాల ఎర.. రైతులకు టోకరా

- నర్సరీ రైతులపై ఆన్‌లైన్ గాలం
- విత్తనాలు పంపుతామంటూ మోసగాళ్ల ఫోన్లు
- అడ్వాన్స్ పంపించాలంటూ డిమాండ్
- ఆ తరువాత ముఖం చాటేస్తున్న వైనం


కడియపులంక ప్రాంతంలోని నర్సరీ (ఫైల్)

కడియం: ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న కొద్దీ మోసగాళ్ల ఆగడాలు కూడా ఎక్కువవుతున్నాయి. ఆన్‌లైన్‌లోనే చెల్లింపుల ప్రక్రియలు కొనసాగుతున్న నేపథ్యంలో కేటుగాళ్ల పని ఇంకొంచెం సులభంగా మారిపోతోంది. ఈజీగా మోసపోయే వాళ్లను ఎంచుకుని వారిపై వల విసురుతున్న ఘటనలు కోకొల్లలుగా వెలుగుచూస్తున్నాయి. తాజాగా మోసగాళ్ల దృష్టి ఇప్పుడు నర్సరీ రైతులపై పడిందన్న భావన వ్యక్తమవుతోంది.

మోసం జరిగే తీరు

చిన్న మొక్కలను తయారు చేసే రైతులకు విత్తనాల అవసరం ఉంటుంది. కొన్ని రకాల విత్తనాలు ప్రస్తుతంగా స్థానికంగా లభ్యం కావడం లేదు. దీంతో వాటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఆరేడు రూపాయలకు దొరికే ఒక్కో విత్తనం ఇప్పుడు రూ.15 కూడా పలుకుతోంది. సరిగ్గా మోసగాళ్ల ఇక్కడే దృష్టి కేంద్రీకరించారు. ఇలా డిమాండ్ ఉన్న విత్తనాలను తాము సాధారణ రేటుకే సప్లయి చేస్తామంటూ సదరు నర్సరీ రైతులకు ఫోన్లు చేస్తున్నారు. వీడియో కాల్ చేసి మరీ తమ వద్దఉన్న విత్తనాలను చూపిస్తున్నారు. తమిళనాడు, బెంగళూరు ప్రాంతాల నుంచి ఇలా ఫోన్లు వస్తున్నాయి. తమకు అడ్వాన్స్ ఇస్తే వెంటనే ట్రాన్స్‌పోర్టుకు వేస్తామని, విత్తనాలు రైతులకు అందాక మిగిలిన డబ్బులు చెల్లించాలని ఆఫర్ ఇస్తున్నారు.

నకిలీ ట్రాన్స్‌పోర్టు బిల్లులతో..

ఇదంతా నిజమేనని నమ్మిన రైతులు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ అడ్వాన్స్ చెల్లిస్తున్నారు. విత్తనాలను ట్రాన్స్‌పోర్టుకు వేసినట్లు మోసగాళ్లు నకిలీ బిల్లులను సృష్టించి, వాటిని రైతుల వాట్సాప్‌కు పెడుతున్నారు. రైతులు ఆయా ట్రాన్స్‌పోర్టు కంపెనీల వద్దకు వెళ్లి బిల్లు చూపించాక అసలు విషయం బయటపడుతోంది. అది నకిలీ బిల్లు అని, తాము అటువంటి బిల్లును ఇవ్వబోమని చెప్పడంతో, మోసపోయామని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకూ కడియం మండలంలోని పలు గ్రామాల నుంచి పదుల సంఖ్యలోనే ఈ విధంగా మోసపోయినట్లు చెబుతున్నారు. దీంతో కొందరు రైతులు నర్సరీ అసోసియేషన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువచ్చారు. సోషల్ మీడియ గ్రూపుల ద్వారా రైతులను ఇటువంటి మోసాలపై అప్రమత్తం చేస్తున్నారు.

అవగాహన ఉన్నావారేనా..

ఇలా మోసాలు చేస్తున్న వారు ఇక్కడి నర్సరీ రైతులపై పూర్తి అవగాహన ఉన్నవారేనన్న భావన వ్యక్తమవుతోంది. కడియం ప్రాంతంలో దాదాపు వెయ్యికిపైగా నర్సరీలు ఉన్నాయి. వీటిలో వంద మంది వరకూ చిన్న సైజు మొక్కలు తయారు చేసే రైతులు ఉంటారు. విత్తనాలు తీసుకువచ్చి, చిన్న మొక్కలు తయారు చేసే రైతులనే మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారంటున్నారు. వారికే నేరుగా ఫోను చేసి వల విసురుతున్నారని చెబుతున్నారు. కొందరు రైతులు బయటకు చెప్పుకోనప్పటికీ మోసపోయిన వారి సంఖ్య భారీగానే ఉంటుందని అంచనా.

అప్రమత్తంగా ఉండాలి

డిమాండ్ ఎక్కువగా ఉన్న విత్తనాల ధరలు సహజంగానే ఎక్కువ ఉంటాయి. అయితే వాటిని సాధారణ ధరకే ఇస్తానంటూ ఎవరైనా వస్తే, అటువంటి వారిపై అప్రమత్తంగా ఉండాలి. నేరుగా వస్తువును చూసే కొనుగోలు చేసుకోవడం ఉత్తమం. ఆన్‌లైన్‌లో అవతలి వాళ్ల చెప్పే మాటలు నమ్మి, డబ్బులు వేస్తే మోసం చేయడానికే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నలుగు రైదుగురు రైతుల నుంచి విత్తనాలు పంపిస్తామంటూ ఫోన్లు చేసి, డబ్బులు వేయించుకున్నారు. అయితే విత్తనాలు మాత్రం పంపలేదు. అందుకే సోషల్ మీడియా గ్రూపుల ద్వారా రైతులను అప్రమత్తం చేస్తున్నాం.

– మల్లు పోలరాజు, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్, కడియపులంక

అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు


హుకుంపేట డిబ్లాకులో గ్రామ సచివాలయం-2 భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- నూతన భవనాల ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. హుకుంపేటలోని సచివాలయం1, 2, 4, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం నూతన భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు వచ్చి చేరుతున్నాయన్నారు. ప్రతి రెండువేల కుటుంబాలకు గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సాగు సూచనలు అందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను చందన దృష్టికి తీసుకురాగా, ప్రతి సమస్యను త్వరిత గతిన పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రూరల్ డి.శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో ఆర్డినేటర్ ఆరమ్‌స్ట్రాంగ్, మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావు, పార్టీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణుమూర్తి, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షకీలా బేగం, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు కురుమళ్ల ఆంజనేయులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నేతలు పసలపూడి శ్రీనివాసరావు, చిర్రా గణేష్, సుశీల, దుర్గాప్రసాద్, తెలగరెడ్డి శ్రీనివాస్, షేక్ మీరా, ఈర్ల నాగు, కుప్పాల రాంబాబు, బండి నాగేశ్వరరావు, పడాల వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించాలి

- రుడా మాజీ చైర్ పర్సన్ షర్మిలారెడ్డి
- ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మెషీన్ల పంపిణీ


కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో జగనన్న, ఎమ్మెస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నామని రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తెలిపారు. కంబాలచెరువు సమీపంలోని హైటెక్ బస్టాండ్ పైన ప్రారంభించిన కేంద్రంలో కుట్టు శిక్షణలో ఉత్తీర్ణులైన 20 మంది మహిళలకు బుధవారం షర్మిలారెడ్డి తన నివాసంలో రూ.2.5 లక్షల విలువైన కుట్టుమెషీన్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో సుమారు 75 మంది శిక్షణ పొందారని, తొలివిడత నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 20 మందికి ప్రస్తుతం మెషీన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మిగతా వారికి కూడా త్వరలో అందజేస్తామన్నారు. సీఎం జగన్, అలాగే తన మామగారు ఎమ్మెస్సార్ స్ఫూర్తితో మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి తనవంతు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు గుదే రఘునరేష్, బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు బూడిద శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్లను త్వరగా పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేయాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. హౌసింగ్, పీఎం స్వనిధి తదితర కార్యక్రమాలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం టిడ్కో, హౌసింగ్, మెప్మా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు సంబంధించి వివిధ దశలలో వున్న లోన్లన్నింటినీ 15 రోజుల్లో విడుదలయ్యేలా చూడాలని, మార్ట్‌గేజ్‌లను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులందరూ తమ వాటా చెల్లించేలా చూడాలన్నారు. పీఎం స్వనిధి పథకంలో దాఖలు చేసిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో బ్యాంకులకు అప్పగించాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఇతర పథకాలను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాసరావు, సెక్రటరీ ఎస్.సత్యవతి, మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్ అస్ఫర్, సీఎంఎం రవిశంకర్ పాల్గొన్నారు.

రహదారులను శుభ్రంగా ఉంచాలి

నగరంలోని రహదారులన్నింటినీ పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందిని కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. జేఎన్, ఏవీ అప్పారావు, తిలక్ రోడ్డుల్లో పారిశుధ్య సిబ్బందితో మాట్లాడారు. అనంతరం షిర్డీ సాయి మార్గ్‌లో నిర్మిస్తున్న కాలువలను, జేఎన్ రోడ్డులోని వాకర్స్ రోడ్డు నిర్మించిన సిమెంట్ రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు ఉన్నారు.

ఘనంగా అక్కినేని శతజయంత్యుత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిత్‌మోహన్‌మిత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు, పద్మ విభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై బుధవారం ఘనంగా నిర్వహించారు. అక్కినేని కల్చరల్ అసోసియేషన్, అక్కినేని వీరాభిమాని అడబాల మరిడియ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నట గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి గన్నికృష్ణ మాట్లాడుతూ ఎన్నో జానపద, చారిత్రక పాత్రలు పోషించిన అక్కినేని నాగేశ్వరరావు మనందరి మదిలో మహానటుడిగా నిలిచారన్నారు. శ్రీపాద మిత్ర మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావుతో నటించడమే కాకుండా, జిత్‌మోహన్ ఆర్కెస్ట్రా ద్వారా అక్కినేనిని సన్మానించడం తన అదృష్టమన్నారు. గంగరాజు డెయిరీ అధినేత నిమ్మలపూడి గోవిందు, కార్యక్రమ కన్వీనర్, సినీ విశ్లేషకుడు అడబాల మరిడియ్య, సినీ యాంకర్ ఏఎస్ ఆనంద్, ముద్రగడ ఏసుబాబు, దేశిసీడి బలరాం నాయుడు, సుక్కిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదంపై హర్షం


నగరంలో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు, మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: మహిళా రిజర్వేషన్ బిల్లు నారీ శక్తి వందనమ్ పార్లమెంట్‌లో ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బుధవారం స్థానిక కంబాల చెరువు పార్కు వద్ద నుంచి ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలకు మోదీ ఇచ్చిన గౌరవంగా దీనిని భావించాలన్నారు.జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, సిటీ కన్వీనర్ యెనుముల రంగబాబు, నాయకులు పాల్గొన్నారు.

కడియం: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు తీసుకురావడంపై మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కడియం వాగ్దేవి కాలేజీ, బాలికల వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాగులపల్లి వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిక్కాల శ్రీనివాస్, కొటికలపూడి వేంకటేశ్వరరావు, బొరుసు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల సత్తా


పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నంలో ఈనెల 17వ తేదీన జరిగిన 15వ రాష్ట్రసాయి కెనోరియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో బొమ్మూరు మారుతి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు రాణించారు. బాలుర విభాగంలో వి.వెంకట అశ్వత్ వర్మ కటాస్ విభాగంలో బంగారు పతకం, కమితే విభాగంలో కాంస్య పతకం, జి.రేశ్వంత్ నాయుడు కటాస్ విభాగంలో రజత పతాకం సాధించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన ఎస్.గిరి వెంకటరమణను ఏపీ స్టేట్ కెనోరియా ప్రెసిడెంట్ కె.సుమన్ అభినందించారు.

ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం


శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజశ్రీ తదితరులు

మధురపూడి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి, డాక్టర్ రాజశ్రీ అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం హైస్కూల్లో బుధవారం జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల కోసం ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతవాసులకు ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తన మామగారైన జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ పేరుతో ప్రజలకు సేవలందించడం సంతృప్తికరంగా ఉందన్నారు. శిబిరంలో సేవలందించడానికి రాజమహేంద్రవరానికి చెందిన 40 మంది వైద్యులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ డాక్టర్లు రావడాన్ని అభినందించారు. తొలుత దివంగత జక్కంపూడి రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరంగపట్నం, మునగాల, కోటి, రాఘవపురం, కోటికేశవరం, బొల్లెద్దులపాలెం, గరగలంపాలెం గ్రామాలకు చెందిన 600 మంది వైద్యసేవలు పొందారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ, తనకాల ప్రసాద్, కొయిడాల నానాజీ, గుత్తి రాము, ఎంపీటీసీ తనకాల నూకరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

రాజమహేంద్రవరం రూరల్/సీటీఆర్ఐ: తన తండ్రి నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్) ఆశయాలతో స్థాపించిన తెలుగుదేశం పార్టీని చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకువెళ్తున్నారని నందమూరి రామకృష్ణ అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ బొమ్మూరులో రూరల్ ఎస్సీ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే దీక్షకు ఆయన బుధవారం సంఘీభావం తెలిపారు. అలాగే సిటీ నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో కోరుకొండ రోడ్డులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన సందర్శించారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

సీతానగరం: వంగలపూడి గ్రామ వలంటీర్ రాచర్ల నాగేంద్రను విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీవో కె.రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 17న నాగేంద్ర మద్యం తాగి సచివాలయానికి వచ్చి సిబ్బందితో గొడవపడ్డాడు. రెండు మోనిటర్లు, ప్రింటర్లు, కంప్యూటర్లను ధ్వంసం చేశాడు. ఈ నేపథ్యంలో ఈనెల 19న పంచాయతీ కార్యదర్శి ఆర్ సుజాత వలంటీర్ నుంచి ప్రభుత్వం అందించిన ఫోన్, బయోమెట్రిక్ డివైజ్‌లను స్వాధనం చేసుకుని, సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఎంపీడీవోకు నివేదిక అందించారు. సచివాలయంలో ధ్వంసమైన కంప్యూటర్లు, సామగ్రి విలువ రూ.50 వేలు ఉంటుంది. కార్యదర్శి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సమర్పణరావు తెలిపారు.

క్లుప్తంగా

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం


వ్యవసాయ కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న శ్యామ్‌రాజు నాయక్, విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామ్‌రాజు నాయక్ అన్నారు. గాంధీజీ 150వ జయంతి నేపథ్యంలో స్వచ్ఛత హేసేవ ఉద్యమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టిన సందర్భంగా బుధవారం కాతేరు వ్యవసాయ కళాశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌రాజు నాయక్ మాట్లాడుతూ ప్రతి గ్రామం, పట్టణంలో స్వచ్ఛతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి, వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


బొమ్మూరులో ఆందోళన చేస్తున్న మహాజన సోషల్ పార్టీ సభ్యులు, ఎంఆర్‌పీఎస్ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలంటూ బుధవారం జాతీయ రహదారిపై బొమ్మూరు వద్ద మహాజన్ సోషల్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇండిగి మిల్లి చిరంజీవి మాదిగ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ మాట్లాడుతూ రిజర్వేషన్లను 75 ఏళ్లుగా ఏకపక్షంగా దోచుకుంటున్న దోపిడీదారులకు బీజేపీ కొమ్ము కాస్తోందన్నారు. కాగా.. మానవహారం నేపథ్యంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించినప్పటికీ ఫలించలేదు. దీంతో వారితో పోలీసులు బలవంతంగా ఆందోళన విరమింపచేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పోసుపల్లి వెంకట్రావు, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైరాల అప్పారావు, జిల్లా కన్వీనర్ గద్దం వినోద్ మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు భీమడోలు కిరణ్, డాన్ సూరి తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణంలో తనిఖీలు


తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులోని రామకృష్ణ ఏజెన్సీస్ ఎరువులు, పురుగుమందు దుకాణంపై రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి అధికారి కె.కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయకపోవడం, స్టాక్‌బోర్డులో నిల్వల వివరాలను లేకపోవడం గుర్తించారు. దీంతో మండల వ్యవసాయాధికారి ఏ.భీమరాజు రూ.26,47,873 విలువైన 2865.50 కిలోల పురుగుమందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. కె.కుమార్ మాట్లాడుతూ మూడు జిల్లాల పరిధిలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. తనిఖీలో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, వ్యవసాయాధికారి భార్గవ మహేష్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం పాల్గొన్నారు.

బాలల సైన్స్ కాంగ్రెస్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో అబ్రహం తదితరులు

కంబాలచెరువు: డివిజన్ స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను ఈనెల 29, 30 తేదీలలో నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఆ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 29న రాజమండ్రి డివిజన్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు ఎస్‌కేవీటీ స్కూల్లో, 30వ తేదీన కొవ్వూరు డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయులు కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఒక సైన్స్ ఉపాధ్యాయుడు విధిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కన్నూరి సతీష్ బాబు, ఎంఈవో గౌరి శంకర్, అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ నెహ్రూ పాల్గొన్నారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు


గణపతిని దర్శించుకుంటున్న సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ గోదావరి తీరంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోందని, ఉత్సవ పందిళ్లు మన ఐక్యతను పెంచుతున్నాయన్నారు. కోటగుమ్మం జంక్షన్‌లో గణేష్ రెడీమేడ్ ఫ్యాన్సీ చిన్న వర్తక సంఘం పదాల పెద వెంకటేశ్వరరావు, కాలే చిన్ని, అడపా రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి పూజలు చేశారు. ఆదెమ్మ దెబ్బ ప్రాంతంలో విగ్రహాలను డివిజన్ ఇన్‌చార్జి గొట్టుముక్కల రాజుతో కలిసి దర్శించుకున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలను తప్పక పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, విధిగా ఖాకీ యూనిఫాం ధరించాలన్నారు. ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెం పాత బస్టాండ్ సెంటర్ వద్ద కొత్త కల్వర్టు నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఇక్కడ పాత కల్వర్టు ఇరుకుగా ఉండి, పలు ప్రమాదాలకు కారణమయ్యేది. దీంతో ఆర్‌అండ్‌బీ నుంచి మంజూరైన రూ.18 లక్షల నిధులతో పది మీటర్ల వెడల్పున కల్వర్టు నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ మధు, సర్పంచ్ అన్నందేవుల చంటి, ఎంపీటీసీ గొల్లపల్లి వెంకటేశ్వరరావు, రావిపాటి రామకృష్ణ, ఉండమట్ల దుర్గారావు, అన్నందేవుల రాముడు, గుబ్బల నాగేశ్వరరావు, సింగన రాంబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులను అవమానిస్తే జైలు

కంబాలచెరువు: దివ్యాంగులను వారి వైకల్యాలతో పిలిచి అవమానిస్తే జైలు శిక్ష తప్పదని ఎస్పీ పి.జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగుల హక్కుల చట్టం 2016లోని సెక్షన్ 92ఎ ప్రకారం ఏ ప్రదేశంలోనైనా వైకల్యం ఉన్న వ్యక్తిని అవమానపరిచినా, ఉద్దేశపూర్వకంగా అవమానించినా, భయపెట్టినా వారికి ఆరు నెలలకు కంటే తక్కువ కాకుండా ఐదేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు.

28న అనంత పద్మనాభస్వామి వ్రతం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: కష్టాలు తొలగించి, సకల శుభాలు కలిగించే అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని ఈనెల 28న గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠంలో నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు తెలిపారు. ఈ వ్రతానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సాయంత్రం దానవాయిపేటలో జరిగిన కార్యక్రమంలో రాజు ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత ఎం.ప్రసాదరాజుతో కలిసి ఆవిష్కరించారు. వెంకన్నబాబు మాట్లాడుతూ అరణ్యవాసంలో కష్టాలను అనుభవిస్తున్న పాండవులకు ఈ వ్రత మహిమను శ్రీకృష్ణుడు వివరించాడన్నారు. కార్యక్రమంలో సుమేధ వెంకటరాజు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాయి రామచంద్రరావు, పెదపాటి వెంకటేశ్వరరావు, మనగుడి మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవాసమితి ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటిలో బంగారం చోరీ

కంబాలచెరువు: స్థానిక వీఎల్ పురంలోని ఒక ఇంటిలో 123 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండిని దొంగలు చోరీ చేశారు. దీనిపై ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పి.పుష్పారావు కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులందరూ యథావిధిగా పడుకున్నారు. తెల్లవారిన తర్వాత లేచిచూసేసరికి పక్క గదిలో తలుపులు తెరిచి ఉన్నారు. గమనించగా బీరువాలోని బంగారు, వెండి నగలు అపహరణకు గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.